## క్లుప్తంగా

### కెనడీ నెక్స్ట్‌జెన్ కిడ్స్‌లో గ్రాడ్యుయేషన్ డే



గుంటూరు ఎడ్యుకేషన్: రాజేంద్రనగర్ 4వ లైనులోని కెనడీ నెక్స్ట్‌జెన్ కిడ్స్ పాఠశాలలో మంగళవారం యూకేజీ చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈసందర్భంగా గౌన్లు, టోపీలు ధరించిన చిన్నారులు బుడి, బుడి అడుగులతో సందడి చేశారు. పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అదే విధంగా విద్యాసంవత్సరంలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో చిన్నారులు పాల్గొన్న ఫోటోలను వారికి అందజేశారు. అనంతరం చిన్నారులు కథలు చెప్పడంతో పాటు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎల్ హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### గుండెపోటుకు అత్యాధునిక చికిత్స

రమేష్ హాస్పిటల్‌లో మెట్రాక్లిప్ చికిత్స




గుంటూరు మెడికల్: గుండెపోటుతో వాల్వ్ లీక్ అయిన వృద్ధుడికి అత్యాధునిక పద్ధతుల్లో చికిత్స అందించినట్లు రమేష్ ఆసుపత్రి కార్డియాలజిస్టు డాక్టర్ పర్వతనేని నాగశ్రీ హరిత చెప్పారు. రమేష్ హాస్పిటల్స్ గుంటూరులో ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా విజయవంతంగా ''మైట్రా క్లిప్'' చికిత్స చేశామన్నారు. మంగళవారం గుంటూరులోని హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. గుంటూరుకు చెందిన 78 సంవత్సరాల వృద్ధుడిని ఆయాసం, నిస్సత్తువ వంటి లక్షణాలతో మంచానికే పరిమితమైన స్థితిలో కుటుంబ సభ్యుల సాయంతో తమ ఆసుపత్రికి తీసుకొచ్చారన్నారు. ఇన్వేజివ్ పద్ధతిలో నిర్వహించే ''మైట్రా క్లిప్'' ద్వారా సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ దగ్గుబాటి రమేష్ ఆధ్వర్యంలో వైద్య చికిత్స అందించామని చెప్పారు. మంగళవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేస్తున్నట్లు వెల్లడించారు. ఆపరేషన్ ప్రక్రియలో కార్డియాక్ ఎనస్థటిస్ట్ డాక్టర్ బికాస్ సాహు, సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ జయరామ్ పాయ్ పాల్గొన్నట్లు తెలిపారు.

### కనుల పండువగా స్వామివారి కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేటలోని శ్రీ గౌరీ విశ్వేశ్వరాలయంలో స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా మంగళవారం స్వామివారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చింతపల్లి సాయి కౌశిక్, అపర్ణ దంపతులచే అర్చకులు సుబ్రహ్మణ్యం స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్, మల్లికార్జునశర్మ పర్యవేక్షించారు.

### స్టాల్ గరల్స్ స్కూల్లో ఫ్యాప్టో సభ్యుల నిరసన

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో కొనసాగుతున్న టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం వద్ద మంగళవారం ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఫ్యాప్టో గుంటూరు జిల్లా చైర్మన్ ఎం. కళాధర్ మాట్లాడుతూ పాఠశాలల సందర్శన పేరుతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఉపాధ్యాయులపై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ సస్పెన్షన్లు చేయడాన్ని వారంతా వ్యతిరేకించారు. ఫ్యాప్టో నాయకులు కె. బసవలింగారావు, కె. నరసింహారావు, జి. వెలాంగిణిరాజు, బి.ఆదిలక్ష్మి, ఎండీ ఖాలీద్, గేరా మోహనరావు, మేకల సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కులం పేరుతో దూషించినందుకు..

గుంటూరు ఈస్ట్: కులంపేరుతో దూషించి బెదిరించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం స్వర్ణాంధ్రనగర్‌కు చెందిన యండ్రపాటి కిరణ్ 2018 సంవత్సరంలో డి.మనోజ్‌కుమార్‌కు రూ. ఐదు లక్షలు అప్పు ఇచ్చాడు. మనోజ్‌కుమార్ ప్రామిసరీ నోట్, చెక్కును కిరణ్‌కు అందజేశాడు. మార్చి 19వ తేదీన పట్టాభిపురంలో ఇరువురు ఎదురు పడ్డారు. మనోజ్‌కుమార్‌ను కిరణ్ డబ్బులు చెల్లించాలని అడిగాడు. ఇరువురు గొడవపడ్డారు. మనోజ్‌కుమార్ కులం పేరుతో కిరణ్‌ను దూషించి చంపుతానని బెదిరించాడు. కిరణ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం

- మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు
- నాజ్‌సెంటర్–బస్టాండు రహదారి అభివృద్ధికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్, ఎమ్మెల్యే ముస్తఫా, కమిషనర్ కీర్తి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ఏళ్ల తరబడి పెండింగ్ సమస్యలకు పాలకవర్గం ఏర్పడిన తరువాత పరిష్కరించడం జరుగుతోందని, ఇందులో భాగంగా నాజ్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ఉన్న రహదారి అభివృద్ధి ప్రజల చిరకాల కోరిక అని నగర నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. మంగళవారం కమిషనర్ కీర్తి చేకూరి, తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, డెప్యూటీ మేయర్ షేక్ సజిలతో కలిసి నాజ్ సెంటర్ నుండి బస్టాండ్ వరకు రూ.1.09 కోట్ల అంచనాలతో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న బీటీ రోడ్ పనులకు గుంట గ్రౌండ్ పక్కన డీ.మార్ట్ వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో పాలకవర్గం ఎన్నిక నాటి నుంచి సుమారు రూ.150 నుంచి రూ. 160 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని, గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి ఆలోచనలకనుగుణంగా కులమతాలకు, పార్టీలకు అతీతంగా నగరంలో 57 వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నాజ్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ఉన్న రోడ్ నగరంలో అధిక ప్రాధాన్యత కలిగిన రోడ్ అని, అందుకు తగిన విధంగా రూ.కోటి పైనే నిధులతో రోడ్ ని డ్రైన్ టు డ్రైన్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే సదరు రోడ్ లో కొంత మేర సెంట్రల్ డివైడర్, లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నాజ్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు 932 మీటర్ల బీటీ రోడ్ ను డ్రైన్ టు డ్రైన్ కు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, పనుల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలకు లోపం లేకుండా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. నగర ప్రజల సౌకర్యార్థం నగరంలో ఇప్పటికే ప్రధాన రోడ్లు అయిన పెద్ద పలకలూరు, నందివెలుగు రోడ్, కుగ్లర్ హాస్పిటల్ రోడ్ల విస్తరణల పనులు పూర్తి చేయడం జరిగిందని, ఏటి అగ్రహారం, డొంక రోడ్, శారదాకాలనీ, రెడ్డి పాలెం రోడ్ విస్తరణ పనులు పురోగతిలో ఉన్నాయని, ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్–3 పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ అభివృద్ధిలో రాష్ట్రంలోనే గుంటూరు నగరం మొదటి స్థానంలో నిలిచేలా పనులు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే ప్రతి వార్డులో ప్రధాన రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజిలా, కార్పొరేటర్లు యాట్ల రవి, పోతురాజు సమత, నగరపాలక సంస్థ ఈ.ఈ. కోటేశ్వరరావు, డీఈఈ శ్రీనివాసరెడ్డి, ఏ.ఈ. సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు నూరి ఫాతిమా, గులాం రసూల్, షేక్ షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణానికి శంకుస్థాపన



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: నియోజకవర్గంలో పలు సామాజిక భవనాలు నిర్మించటానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, ఈ సంవత్సరంలో కొన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. మంగళవారం సుద్దపల్లిడొంక 10వ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ 4వలైనులో ముస్లీం సామాజికవర్గానికి చెందిన భవన నిర్మాణానికి శంకుస్థాపన ముందుగా చేశారు. అందులో భాగంగా ముందుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రూ 20 లక్షల వ్యయంతో సామాజిక భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ మీరావలి, వైఎస్సార్ సీపీ మహిళా నేత నూరిఫాతిమా, నేతలు కోట సత్యం, రాంబాబు, సుబ్రమణ్యం, చింకా శ్రీనివాసరావు, మజీదా, షేక్ హుస్సేన్, మదర్సా అధ్యక్షులు షేక్ సుభాని, మాబువలి, కోటయ్య, కుర్రా పున్నారావు, కుంటా బాబు తదితరులు పాల్గొన్నారు.

## జనమంతా జగనన్న వెంటే



బ్రోచర్ చూపుతున్న ఎమ్మెల్యే సుచరిత, బొప్పన భవకుమార్, కో–ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి

గుంటూరు రూరల్: రాష్ట్రంలోని ప్రతి కుటుంబం జగనన్న వెంటే ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు బొప్పన భవకుమార్, ఐదు జిల్లాల గృహ సారథుల కో–ఆర్డినేటర్ కందుల రవీంద్రారెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతంగా జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. కోటి మంది లబ్ధిదారులను రాష్ట్ర వ్యాప్తంగా గృహ సారథులు కలవటం జరిగిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఇప్పటికే 79 లక్షల మిస్‌డ్‌కాల్స్ వచ్చాయని తెలిపారు. 79 లక్షల కుటుంబాలు జగనన్నకు మద్దతు తెలిపాయని వివరించారు.ఈ మేరకు మిస్డ్‌కాల్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో దాదాపు 80 శాతం గృహ సారథులు ప్రజల ఇళ్లకు తిరిగారని, జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు సంతృప్తికర స్థాయిలో తమకు అందుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేసినట్లు చెప్పారు. ప్రజా స్పందనను చూసి ఓర్వలేని చంద్రబాబు, ఆయన దత్త పుత్రుడు జగనన్నపై, రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. అదేవిధంగా ప్రత్తిపాడు ప్రధాన రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్‌కు త్వరలో అనుమతులు రానున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణానికి జగనన్నను అడిగిన వెంటనే రూ.3 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో నియోజక వర్గంలోని ఐదు మండలాల జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

## పసికందు కడుపులో బ్యాటరీ తొలగింపు

ప్రాణాపాయ స్థితి నుంచి బాలుడిని కాపాడిన గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్



ఎండోస్కోపి చేసిన అనంతరం పసికందు ధనుష్, డాక్టర్ నాగూర్‌బాషా

గుంటూరు మెడికల్: ఆటలు ఆడుకుంటూ బటన్ బ్యాటరీ నోట్లో పెట్టుకుని మింగిన ఆరు నెలల పసికందు కడుపు నుంచి సకాలంలో బటన్ బ్యాటరీని బయటకు తీసి ప్రాణాపాయ స్థితి నుంచి బాలుడిని కాపాడారు. సోమవారం స్థానిక గుంటూరువారి తోట ఏడోలైనులోని కేర్‌వెల్ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్ బాషా మీడియాకు వివరాలు వెల్లడించారు. తెనాలి వైకుంఠపురానికి చెందిన కె.తిరుపతమ్మ, తేజల ఆరు నెలల పసికందు ధనుష్ ఇంట్లో ఆట్లాడుకుంటూ సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో బటన్ బ్యాటరీ నోట్లో పెట్టుకుని ఆటలాడుతూ మింగేశాడు. తొలుత తెనాలిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా వారు గుంటూరు వెళ్లాలని రిఫర్ చేశారు. సాయంత్రం 6 గంటల సమయంలో పసికందును గుంటూరు కేర్‌వెల్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. కడుపులో ఉన్న బటన్ బ్యాటరీ కడుపులో ఉన్నట్లు పరీక్ష చేసి నిర్ధారించామని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ నాగూర్‌బాషా చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తమ ఆసుపత్రిలో అందుబాటులో ఉండటంతో ఎండోస్కోపిక్ ద్వారా పొట్టలో ఇరుక్కుపోయిన బటన్ బ్యాటరీని కేవలం ఐదు నిమిషాల వ్యవధిలో బయటకు తీశామన్నారు. మత్తు వైద్యులు డాక్టర్ త్రినాథ్ సహకారంతో విజయవంతంగా బటన్ బ్యాటరీని బయటకు తీసినట్లు వెల్లడించారు. సకాలంలో బటన్ బ్యాటరీని బయటకు తీయని పక్షంలో పిల్లవాడికి ప్రాణాపాయ స్థితి ఏర్పడేదన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా చిన్నారులు ఆడుకునే సమయంలో నోట్లో పట్టే సైజులో ఉండే వస్తువులు అందుబాటులో లేకుండా చూడాలన్నారు. అంతేకాకుండా పిల్లలు ఆడుకునే సమయంలో తప్పనిసరిగా వారిని కనిపెడుతూ ఉండాలని, ప్రమాదవశాత్తు ఏదైనా వస్తువు మింగితే తక్షణమే గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించాలన్నారు.

### రైల్వే జడ్ ఆర్ యూసీసీ సభ్యుడిగా గోరంట్ల

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, గుంటూరుకు చెందిన గోరంట్ల సత్యనారాయణను సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటీవ్ కమిటి (జడ్‌ఆర్‌యూసీసీ) సభ్యుడిగా నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం జడ్‌ఆర్‌యూసీసీ డెప్యూటీ జనరల్ మేనేజర్ కె.ముత్యాల నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆకట్టుకున్న నృత్యోత్సవాలు



శృతి సమన్వి నృత్య ప్రదర్శన



ప్రియా నృత్య ప్రదర్శన

పాత గుంటూరు: బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో మహా మంజీరనాదం పేరుతో నృత్యోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆడిటర్ రామరాజు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజమండ్రికి చెందిన మద్దిపట్ల ప్రియ ప్రాణేశన్, విజయవాడకు చెందిన కాకర్లపూడి శృతి సమన్వి చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ దర్శకుడు కాశీనాధుని విశ్వనాథ్‌కు కళాకారులు తాళ్లూరి ధరణి, బీసా బత్తిని పూజిత శ్రీ, డాక్టర్ ఇప్పల వేదవతి గణేష్, ఎర్రగుంట హేమ జోషిక చౌదరి నృత్య ప్రదర్శనలతో నివాళులు అర్పించారు. అనంతరం కళాకారులను యువ కళారత్న పురస్కారంతో సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం సత్కరించారు. కార్యక్రమాన్ని గరికపాటి శిరీష, పెద్ది సతీష్ పర్యవేక్షించారు.

## అగ్ని ప్రమాదంలో వాహనం దగ్ధం



వాహనంలో మంటలు వ్యాపించిన దృశ్యం

గుంటూరు ఈస్ట్: అమెజాన్ గూడ్స్ క్యారీయర్ వాహనం దగ్ధమైన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రఘురామ్‌నగర్‌కు చెందిన కె.శ్రీక్రాంత్ టాటాఏసీ వాహనంలో అమెజాన్ గూడ్స్‌ను తీసుకెళుతున్న క్రమంలో మంగళవారం పోలీసుపరేడ్‌గ్రౌండ్ వద్దకు చేరుకోగానే వాహనం ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. వాహనంలోని గూడ్స్ మొత్తాన్ని కింద పడేశారు. వాహనం పూర్తిగా దగ్ధమైంది. రూ. 80 వేలు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీ చైతన్యలో విద్యార్థి అనుమానాస్పద మృతి



హరిచరణ్ మృతదేహం

గుంటూరు ఈస్ట్: గుంటూరు నవభారత్ నగర్ 4వ లైనులోని శ్రీ చైతన్య బాయ్స్ హాస్టల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి ఐదోఅంతస్తు నుంచి కిందపడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సేకరించిన సమాచారం మేరకు ఏటుకూరు గ్రామం గాయత్రినగర్‌కు చెందిన మల్లేష్ నాయుడు మంగళగిరి ఎస్ఈబీలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. అతని పెద్దకుమారుడు తమ్మినేని హరిచరణ్ (15) గుంటూరు నవభారత్‌నగర్ 4వ లైనులోని శ్రీచైతన్య బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం హరిచరణ్ అస్వస్థతకు గురికావడంతో హాస్టల్ సిబ్బంది అతనిని నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించి, అనంతరం హాస్టల్‌కు తీసుకొచ్చారు. మంగళవారం తెల్లవారుజామున హరిచరణ్ హాస్టల్ ఐదో అంతస్తు నుంచి కిందపడ్డాడు. హాస్టల్ సిబ్బంది అతనిని నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. హరిచరణ్ తండ్రి మల్లేష్ నాయుడు, తల్లి స్వాతి, కుటుంబ సభ్యు లు తమ కుమారుడి మృతి చెందడాన్ని తట్టుకోలేక తీవ్రంగా రోదించారు. ఈ మేరకు విద్యార్థి తల్లిదండ్రులు పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హాస్టల్ ఐదో అంతస్తులో ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్ గతంలోనే తొలగించి ఉంది. హాస్టల్ సిబ్బంది దానిని మరమ్మతులు చేసి బిగించి విద్యార్థుల పట్ల సరైన పర్యవేక్షణ ఉంటే ఈ ఘటన జరిగేది కాదని బాలుడి తల్లిదండ్రులు ఆరోపించారు.

### ఘనంగా ఆది శంకరాచార్య జయంతి

నెహ్రూనగర్: వేద,ఉపనిషత్తుల సారాన్ని భగవద్గీత బ్రహ్మ సూత్రాలు సారాంశాన్ని ప్రస్థాన త్రయంగా భాష్యం రాసి దేహమే దేవాలయం ఆత్మయే పరమాత్మయని ఆధ్యాత్మిక సత్యాన్ని చాటిచెప్పిన మహనీయులు జగద్గురువు ఆదిశంకరాచార్యులేనని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంత రావు పేర్కొన్నారు. ఆది శంకరాచార్యుల జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుంటూరు అరండల్ పేట లోని విశ్వబ్రాహ్మణ సమాజంలో జయంతి మహోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డ శ్రీనివాసరావు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు అంగలకుదురు సుశీల, జిల్లా అధ్యక్షులు ఏడూరి శివ రామబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షులు నాగేశ్వర చారి, ప్రధాన కార్యదర్శి అద్దంకి భద్రయ్య, కోశాధికారి కొండేపు వెంకట రావు, జాతీయ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముంజేపల్లి శివకుమార్, విశ్వకర్మ పీఠం మల్లేశ్వరరావు, విశ్వహిందూ పరిషత్ పెద్దలు సదాశివరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మామిడి పండ్ల దుకాణాల్లో అధికారుల తనిఖీ

గుంటూరు మెడికల్: స్థానిక లాలాపేటలోని మామిడి పండ్ల కాపు దుకాణాల్లో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ షేక్ గౌస్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు జరిగాయి. ఎక్కువ శాతం మంది మామిడి పండ్ల వ్యాపారస్తులు మామిడి పండ్ల పరిపక్వతకు క్యాల్షియం కార్బైట్‌ను వాడకపోవడం గమనించి వారిని అభినందించారు. కొంత మంది వ్యాపారస్తులు ఎతోఫాన్ రసాయనాన్ని నేరుగా పండ్లపై స్ప్రే చేయడాన్ని గమనించి నిబంధనలకు విరుద్ధంగా నేరుగా స్ప్రే చేయకూడదని హెచ్చరించారు. ఎతోఫాన్ ప్యాకెట్లను తడిచేసి పండ్లకు తగలకుండా మామిడి పండ్ల ట్రేల్లో ఒక మూలన ఉంచి రవాణా చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

వేసవిలో అమితంగా మామిడిని ఇష్టపడే వినియోగదారులంతా మామిడి పండ్లను రెండు నిమిషాలు నీటి ధార కింద ఉంచి శుభ్రంగా కడగాలని గౌస్ మొహిద్దీన్ తెలి పారు. ఉప్పు ద్రావణంలో ఐదు నిమిషాలు ముంచి కడిగి తినడం చాలా ఉత్తమమని పేర్కొన్నారు. పండ్లపై ఉండే కీటక నాసిని అవశేషాలను పూర్తిగా తొలగించేందుకు మామిడి పండ్లపై తొక్కను పూర్తిగా తీసి తినడం ఆరోగ్యమని వెల్లడించారు. వ్యాపారస్తులందరూ వార్షిక టర్నోవర్‌ను ఫామ్–డీ1లో పొందుపరిచి మే 31వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా పంపాలన్నారు. ఆలస్యమైతే రోజుకు రూ. 100లు చొప్పున జరిమానా ఉంటుందన్నారు. ఆహార తయారీ, రీప్యాకింగ్, రీలేబుల్స్ వ్యాపారులు తమ ఉత్పత్తులను ఎన్ఏబీఎల్ అక్రిడేషన్ ల్యాబ్‌లో పరీక్ష చేయించి ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. ఆహార వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరూ నిబంధనలు లోబడి లైసెన్సులు, రిజిస్ట్రేషన్‌లు పొందాలన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేసేవారికి భారీ జరిమానాలు విధించే అవకాశం ఉందన్నారు. లైసెన్సు లేకుండా వ్యాపారం చేస్తే ఆరు నెలలు కఠిన కారాగార శిక్ష, రూ. ఐదు లక్షల వరకు జరిమానా ఉంటుందని హెచ్చరించారు. తనిఖీల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారి రవీంద్రా రెడ్డి, తదితరులు ఉన్నారు.

### వ్యాక్సిన్ పాడవకుండా సక్రమంగా నిల్వ చేయాలి

గుంటూరు మెడికల్: ఫార్మాసిస్టులు వ్యాక్సిన్‌లు పాడవకుండా నిల్వ చేయడంలో మెలకువలు నేర్చుకుని ఉత్తమ ఫార్మాసిస్టులుగా సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. నూతనంగా ఫార్మాసిస్టులుగా విధుల్లో చేరిన 50 మందికి మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో వ్యాక్సిన్ నిల్వలు ఏవిధంగా చేయాలి, సురక్షితంగా వ్యాక్సిన్‌ను ఉంచేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ వ్యాక్సిన్‌లు పాడవకుండా భద్రపరిచేందుకు ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బందికి అందజేసే డీఫ్రీజర్లు, వాక్సిన్ కూలర్లను సక్రమంగా వినియోగించాలన్నారు. ఏ వ్యాక్సిన్లు ఏవిధంగా నిల్వ చేయాలో క్షుణ్ణంగా నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సుబ్బరాజు, డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, ఫార్మసీ యూనియన్ నాయకులు రాధాకృష్ణ, పాల్గొన్నారు.

### పన్ను రాయితీకి ఐదు రోజులే గడువు

నెహ్రూనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2023–24) సంబంధించిన ఆస్తి పన్నును ఏకమొత్తంగా చెల్లించే వారికి మొత్తం పన్ను పై 5 శాతం రాయితీకి 5 రోజులే గడువు ఉందని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 5 శాతం రాయితీని ఈ నెల 30లోపు ఏకమొత్తంగా ఆస్తి చెల్లించి పన్ను రాయితీని వినియోగించుకోవాలని కోరారు. నగరపాలక సంస్థ 2023–24 డిమాండ్ మొత్తం ఆన్ లైన్ లో పొందుపరచడమైనదని, ఆస్తి, ఖాళీ స్థలపన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకుని ఈ నెలాఖరు లోపు ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందాలని కోరారు. పన్ను చెల్లింపు సమాచారం కోసం ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు పని చేసేలా హెల్ప్ డెస్క్‌లను, పన్ను చెల్లింపునకు నగరపాలక సంస్థ ప్రధా న కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలలో అదనపు క్యాష్ కౌంటర్లను, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్‌లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్ లోని 148 వార్డ్ సచివాలయాల్లో క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.